

ఉపాధ్యాయుడిని నియమించరూ..



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ జంగిడివలస పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని సిపిఎంకు చెందిన స్థానిక మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు మంగళవారం ఎంఇఒ సుందరరావుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల తెరిచి నెలరోజులు గడుస్తున్నా ఉపాధ్యాయుడు నియమించకపోవడం దారుణమన్నారు. జంగిడివలస, అద్రగుడ గ్రామాల్లో 30మంది పిల్లలు చదువుకు దూరమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి సార్వత్రిక సమ్మెకు కార్మికులు సన్నద్ధం

- నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు డిమాండ్
- సమ్మెకు అన్ని తరగతుల సంఘీభావం



డుంబ్రిగుడ పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యాన నినాదాలు చేస్తున్న ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి- పాడేరు: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 9న బుధవారంనాటి సార్వత్రిక సమ్మెకు జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు సన్నద్ధమయ్యారు. అనేక రంగాల కార్మికులు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే పోరాటాలు చేసి, రక్తం చిందించి సాధించుకున్న హక్కులు, చట్టాలను అటకెక్కించి, లేబర్ కోడ్స్ అమలుతో కార్మికులపై ఉక్కుపాదం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిఘటించి, పోరాడేందుకు దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక వర్గాలు జాతీయ సమ్మెకు ఉపక్రమించాయి. ఈ సమ్మెలో జిల్లాలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు, మధ్యాహ్న భోజన కార్మికులు సిహెచ్‌డబ్ల్యూలతో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. అసంఘటిత రంగం భవన నిర్మాణ కార్మికులు, ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఉపాధి హామీ పథకం లోని కూలీలు, కాఫీ కార్మికులు, రైతులు, ఆసుపత్రిలోని శానిటేషన్ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారు. బ్యాంకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్‌టిసి, రైల్వే, పర్యాటకం వంటి రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సమ్మెకు సమాయత్తమౌతున్నారు.

జాతీయ సమ్మె జయప్రదానికి జిల్లాలో మూడునెలలుగా కార్మిక వాడల్లో పెద్దఎత్తున సిఐటియు ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు, చైతన్యర్యాలీలతో కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేశారు. సమ్మెలో భాగంగా మండలస్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు వేలాదిమంది కార్మికులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన నినాదాలను హోరెత్తించడానికి సిద్ధమయ్యారు. రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు పెంచకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర నిరసన జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని వివిధ ప్రభుత్వ రంగాల్లో కార్మికులు చేస్తున్న ఉద్యమిన్నారే ఉతమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించక పోయినా, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సంక్షేమ పథకాలను వర్తింప చేయడం లేదని, కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనం నెలకు రూ. 26వేలు చెల్లింపు, పిఎఫ్, ఇఎస్‌ఐ, సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం కార్మికులను అందర్నీ పర్మినెంట్ చేయాలని అసంఘటిత రంగ కూలీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులను, ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను సమగ్ర చట్టం తెచ్చి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కార్మిక సంఘాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సార్వత్రిక సమ్మె చారిత్రాత్మకంగా నిలుస్తోంది.

హక్కుల పరిరక్షణకు పోరాటం

కార్పొరేట్ల లాభాలు చేకూర్చేలా కార్మిక చట్టాలను సంస్కరించి, లేబర్‌కోడ్స్‌తో కార్మికుల హక్కులను హరించి, యాజమాన్యాలకు బానిసలను చేయాలన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ కార్మికలోకం సమ్మెకు సన్నద్ధమైంది. లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమం తప్ప మరో ప్రత్యామ్నాయం కార్మికులకు లేదు. మరోవైపు విశాఖ ఉక్కు, రైల్వేలు, ఎల్‌ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. నష్టాల్లో ఉన్న కంపెనీలను కొనుగోలు చేయడం ద్వారా బ్యాంకులను దివాలా తీయించేలా చూస్తున్నారు. ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు మంగళం పాడాలన్న కేంద్రం కుయుక్తులకు అడ్డుకట్ట వేయడానికి దేశవ్యాప్తంగా కార్మికలోకం ఏకతాటిపైకొచ్చి సమ్మె చేస్తోంది.

పల్లపు వెంకట్
జిల్లా ప్రధాన కార్యదర్శి
సిఐటియు, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా

వి.ఉమామహేశ్వరరావు
జిల్లా ప్రధాన కార్యదర్శి
సిఐటియు, అల్లూరి జిల్లా



ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - చింతూరు : చదలవాడ పంచాయతీ తులసిపాక లక్కవరం శిరసనపల్లి, గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కనీసం చేతిపంపులు కూడా బాగుచేయడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో మంగళవారం తులసిపాక కేంద్రం వద్ద ఖాళీ బిందెలతో ప్రదర్శన అనంతరం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐద్వా మహిళా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సిరసనపల్లి, తులసిపాక, లక్కవరం, గ్రామాల మహిళలు తరలివచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు అంతర్గత రోడ్లు, వీధిలైట్లు లేక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయాన్ని అనేకసార్లు సచివాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం చేయడం లేదని గ్రామ సచివాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తున్నామని చెబుతున్నారని, కనీసం ప్రజలకు తాగేందుకు మంచినీళ్లు కూడా అందించే పరిస్థితి లేదని అధికార యంత్రాంగం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సచివాలయ కార్యదర్శి 'సమస్య పరిష్కారం నా చేతుల్లో లేదు.. మీరు వెళ్లి ఐటిడిఎ పిఒకి చెప్పుకోండి, నేనైతే ఏమి చేయలేను' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమిటని ఆమె నిలదీశారు. గిరిజన సంఘం నాయకులు కలుముల మల్లేష్, మడకం రామారావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా మండల కమిటి సభ్యులు రాములమ్మ, కలముల శారద, గ్రామస్తులు పాల్గొన్నారు

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు



రంపచోడవరంలో షాపులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: పాఠశాలల సమీపంలోని ఉన్న కిరాణా దుకాణాల వద్ద గుట్కా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని సిఐ సన్యాసినాయుడు హెచ్చరించారు. మంగళవారం జడ్డంగి ఎస్ఐ చినబాబు పోలీస్ సిబ్బంది ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. రాజవొమ్మంగి పాఠశాలల సమీపంలో కిరాణా దుకాణాలను తనిఖీ చేసి పొగాకు ఉత్పత్తులను అమ్మవద్దని దుకాణదారులను హెచ్చరించారు. జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోర్నగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పొగాకు ఉత్పత్తులు, కాట్‌పా చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులకు బానిస కావద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ ప్రోగ్రాంలో భాగంగా రంపచోడవరం ఎస్ఐ వెంకటరావు రంపచోడవరం స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల సమీపంలో షాపులో పొగాకు సంబంధిత ఉత్పత్తులను విక్రయించరాదని సూచనలు జారీ చేశామని దుకాణంలో తనిఖీలు కూడా నిర్వహించామన్నారు. కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తత

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గోదావరి, శబరి నదులు ప్రభావిత ప్రాంతాలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్మెంట్‌పై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎటపాక, కూనవరం, చింతూరు, విఆర్ పురం అధిక వర్షాలు పడుతన్నాయని, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలు కావలసిన ముందస్తు చేర్యలు చేపట్టాలన్నారు. శానిటేషన్‌పై ఆర్ డబ్ల్యుఎస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని. రానున్న రెండు రోజుల్లో మొబైల్ టాయిలెట్ మోడల్ తయారు చేయాలన్నారు.

ప్రజలను తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేసారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, సచివాలయాల పరిధిలో విఆర్‌ఒ, పంచాయతీ సెక్రెటరీ, వార్డ్ సెక్రటరీ, మహిళా పోలీసు, ఎడ్యుకేషన్ సహాయకులు భాగస్వామ్యులు కావాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్, మాట్లాడుతూ వరదతో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగాఉండాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె పద్మలత, ట్రైబుల్ వెల్ఫర్ డిడి రజని, ఎన్‌డిఆర్‌ఎఫ్ సభ్యులు ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, తహశీల్దార్ తారకేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేలో నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్

జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- పాడేరు : భూముల రీసర్వే ప్రక్రియలో జాప్యం చేస్తే సస్పెన్షన్ తప్పదని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి 22 మండలాల తహశీల్దారులు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మ్యుటేషన్లు, 13 నోటిఫికేషన్, గ్రౌండ్ ట్రూథింగ్ భూముల రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భూముల రీ సర్వేకు తాహశీల్దారులు చొరవ చూపించాలన్నారు. ముందుగా నిర్దేశించిన లక్ష్యం మేరకు 375 గ్రామాలలో ఈనెలఖారుకు పాడేరు డివిజన్లో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందితో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. 13 నోటిఫికేషన్ జారీ చేసి గ్రామ సభలు నిర్వహించి సర్వే పూర్తి చేయాలన్నారు. రంపచోడవరం డివిజన్‌లో 133 గ్రామాలకు 8 గ్రామాలకు మాత్రమే 13 నోటిఫికేషన్ జారీ చేసారని, రెవెన్యూ సదస్సులలో స్వీకరించి ఫిర్యాదులు 364 పరిష్కరించాల్సి ఉందన్నారు.

పాడేరు డివిజన్లో 211 ఫిర్యాదులు, రంపచోడవరం 152, చింతూరులో ఒక ఫిర్యాదు ఉందని, వాటిని త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో 11,581 మ్యుటేషన్లకు వినతులు వచ్చాయన్నారు. 7568 పూర్తి చేసారని మిగిలిన మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలన్నారు.సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, 22 మండలాల తాహశీల్దారులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

బాలికల గురుకుల కళాశాలలో సీట్లు పెంచాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలోని బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ సీట్లు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవన్‌కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది గురుకుల కళాశాలో ఇంటర్‌లో ప్రవేశానికి 1500 మంది గిరిజన బాలికలు దరఖాస్తు చేసుకుంటే, కేవలం 450 మందికె మాత్రమే సీట్లు కల్పించారన్నారు. కళాశాలలో అడ్మిషన్లు పొందలేని విద్యార్థులు చదువుకు దూరమయేయ పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో పాడేరు ఐటిడిఎ పరిధిలో ఉన్న బాలికల గురుకుల కళాశాలల్లో అదనంగా ప్రతి గ్రూప్‌నకు 10సీట్లు పెంచాలని, బాలికల గురుకుల కళాశాల భవనాలకు మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు, అధికారులు తక్షణమే స్పందించి అన్ని కళాశాలలో అన్ని గ్రూప్‌ల్లో అదనంగా సీట్లు పెంచాలని, కోరారు. గిరి బాలికలను ఉన్నత విద్యకు దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. చిన్నారావు, నాయకులు డి. చందు పాల్గొన్నారు

ఉపాధి హామీతో ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు

'వనం- మనం'లో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సింహాచలం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పిఒ సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలు అభివద్ధి చేయుటకు తగు చర్యలు చేపడుతున్నట్టు రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరం మండలం కుంజంవీధిలో వనం-మనంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వివిధ రకాలైన ఉద్యానవన పండ్ల మొక్కలు గిరిజన రైతులకు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీమతి బంధం శ్రీదేవి, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, సర్పంచ్ చేదల దేవి, ఉపాధిపథకం ఎపిడి సత్యనారాయణ, ఎఒ జయంతి, జెఇ అడ్మిన్‌బాబు, వీరన్న, శేఖర్, అమ్మాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మొక్కలు నాటి తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి అన్నారు. మండలంలోని పాతరామవరంలో బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బయనపల్లి సర్పంచ్ పార్వతి బిజెపి నాయకులు సీతారామన్నదొర, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని బకులూరు పంచాయతీ అంకంపాలెంలో ఉపాధి పథకంలో భాగంగా పండ్ల మొక్కలు నాటారు. పంచాయతీ అధ్యక్షులు పొట్టిక శ్రీనివాస్, కూటమి నాయకులు దేముడు, కోపూరు లక్ష్మణరావు, పొట్టిక స్వామినాయుడు ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ప్రతిఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు అన్నారు.మంగళవారం దూసరపాము, పంచాయతీ ఎర్రంపాడులో రైతు పొలంలో కొబ్బరి మొక్కలు నాటారు. అలాగే ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెద్దిరాజు, ఉపాధిహామీ ఎపిఒ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్

తునికాకు సేకరణ డబ్బులు తక్షణమే చెల్లించాలి

-సిపిఎం

ప్రజాశక్తి - చింతూరు : 2025 ఏప్రిల్, మేలో చింతూరు డివిజన్ వ్యాప్తంగా తునికాకు కార్మికులు ఆకు సేకరణ సేకరించి రెండు నెలలు పూర్తయినా నేటికీ డబ్బులు చెల్లించకపోవడం ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యవైఖరి అని తక్షణమే డబ్బులు చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరు సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్, మేలో తునికాకు సేకరణ జరిగి రెండు నెలలు పూర్తయినా కార్మికులకు కట్టకు ప్రభుత్వం చెల్లించే రూ.3-90 పైసలు నగదును నేటికీ కార్మికులకు అందించలేదని తునికాకు కాంట్రాక్టర్లు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారంగా వారి డబ్బులు వారు చెల్లించారు కానీ ప్రభుత్వం చెల్లించాల్సిన నగదు మాత్రం చెల్లించకపోవడం కార్మికులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు 2012 నుండి తునికాకు బోనస్ డబ్బులు పెండింగ్ ఉన్నాయని2021 బోనస్ మాత్రమే చెల్లించారని, బోనస్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే డివిజన్ డిఎఫ్ఒ కార్యాలయాన్ని, స్థానిక ఐటిడిఎని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటి కార్యదర్శివర్గ సభ్యులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పత్రా రమేష్, వీరబోయిన దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి సూచించారు. జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమతెరలను వినియోగించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం : బూసిగూడెంలో జనసేన కార్యకర్త బచ్చల ఆదినారాయణకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. మంగళవారం వారిని జనసేన పార్టీ నాయకులు పరామర్శించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖరరెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు కాకి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - మోతుగూడెం : అల్లూరి జిల్లా, చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తపల్లి పంచాయతీ గొందిగూడెం గ్రామానికి చెందిన సేరామయ్య కుమార్తె కురా జయ రంపచోడవరం కాలేజీకి వెళ్లి తిరిగి వచ్చి వారి పొలంలో చెట్టుకు చున్నీతో ఉరి వేసుకుని మంగళవారం మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న మోతుగూడెం ఎస్ఐ సాదిక్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మల్లేశ్వరావు సూచించారు. డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించిన ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అడ్మిషన్లు గత సంవత్సరం కన్నా అధికంగా చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించి అడ్మిషన్లు పెంచాలని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ వంటి ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం చింతూరు డివిజన్లకు సంబంధించిన కోఆర్డినేటర్లు హాజరయ్యారు.

ఉపాధ్యాయులు లేకుండా పేరెంట్స్ మీటింగా?

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం మారుమూల పంచాయతీ పరిధి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో టీచర్లు లేకుండా మెగా పేరెంట్స్ మీటింగ్ ఎలా ఏర్పాటు చేస్తారని సిపిఎం జికె వీధి మండల కార్యదర్శి గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూలై 10న సమావేశం నిర్వహించడం మంచిదైనప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో నేటికీ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ముందు ఉపాధ్యాయులు నియమించి తరువాత సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాలికొండ సర్పంచ్ కాకూరు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ-1 లక్ష్మీనారాయణను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- కూనవరం: మండలంలో ఇంచార్జి ఎంఇఒ -1గా పనిచేస్తున్న వి.వి. లక్ష్మీనారాయణను సస్పెండ్ చేయాలని మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆయన బాధ్యతారహిత విధుల వల్ల మండ లంలో పాఠశాలల పరిస్థితి అధ్వానం గా తయారైందన్నారు. ముల్లూరు పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఉన్నా ఉపాధ్యాయులు లేరన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఒకరికి డిప్యూటేషన్ ఇచ్చి కూటూరు పాఠశాలకు పంపించి మిగిలిన ఒక్క ఉపాధ్యాయునికి అన్‌డ్యూటీలో పై చదువులు చదువుకునేందుకు పంపారన్నారు. ఉపాధ్యాయులు లేకుండా సిఆర్‌పిలు, అటెండర్లతో పాఠశాల నడిపిస్తున్నారని ఆరోపించారు. లక్ష్మీనారాయణపై పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజి, విద్యా కమిటీ చైర్మన్ సోడె నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిటిసి నాగేశ్వరరావు

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం



హుకుంపేటలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలదేవ్ తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

హుకుంపేట: అఖిల భారతసమ్మెకు ఆదివాసి గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం హుకుంపేట పిహెచ్‌సి వద్ద జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మికులు సమ్మె, సంఘాలు ఏర్పాటుచేసే హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ, అంగన్వాడీ, మిడ్డే మీల్, వీఆర్‌ఏ, ఈఎంఆర్‌ఐ సిబ్బంది, గురుకుల సెక్యూరిటీ వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేసిన నీస వేతన చట్టాన్ని సవరించి, వేతనాల పెంపుతో కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. హైమావతి, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, కార్మిక వర్గం సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

అంగన్వాడీలు, విఓఎల సమ్మె నోటీసు

జి.మాడుగుల : నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు, ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు వెలుగు విఓఎలు, అంగన్వాడీలు ప్రకటించారు. ఈ మేరకు వెలుగు యానిమేటర్లంతా ఎపిఎమ్‌కు, అంగన్వాడీలంతా సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేశారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేసి కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

డుంబ్రిగుడ: ఈ నెల 9న చేపట్టే అఖిల భారత కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు, శ్రామిక మహిళ సంఘం జిల్లా నాయకురాలు విజయ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వి హెచ్ సి లో నా, కిల్లోగూడ పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తల మాసాంతర సమావేశంలో కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని కిలగడ పిహెచ్‌సిలో ఆశ వర్కర్లు, సిహెచ్‌బ్ల్యులతో మంగళవారం సిఐటియు కార్యదర్శి, కె శంకరరావు సమావేశాన్ని చేపట్టారు. సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈసందర్భంగా స్థానిక వైద్యాధికారి శిరీషకు వారంతా సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ జాతీయ సమ్మెలో అన్ని వర్గాల కార్మిక సంఘాలు, కార్మికులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమార్ చేశారు. అనంతరం లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాథ్ మాట్లాడుతూ పోరాటం చెస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికిసిఐటియు పోరాటం చేస్తోందన్నారు. ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు కే సరస్వతి, పి కవిత, పి సత్యవతి పాల్గొన్నారు.

సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

కొయ్యూరు : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మంగళవారం కొయ్యూరులో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరువాడ దేముడు తదితర నేతలతో కలిసి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెకు మద్దతు ఉంటుందన్నారు.

కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని సిపిఎం, సిఐటియు జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, మండల నాయకులతో కలిసి సమ్మెపై ప్రచారం చేశారు. ఆటోలపై సమ్మెస్టిక్కర్లు అతికించి సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఎటపాకలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎటపాక: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేసి మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిఐటియు మండల నాయకులు తోట శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం బుక్‌లెట్లను, కరపత్రాలను ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్ యూనియన్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పులుసు బాలకృష్ణ, నూతలపాటి సుధాకర్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని మంగళవారం రాజవొమ్మంగి అల్లూరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రామరాజు,టి శ్రీను,ఆటో యూనియన్ నాయకులు భవాని మాట్లాడుతూ నేడు రాజవొమ్మంగిలో జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



సమ్మె సంచికను ఆవిష్కరిస్తున్న బోనంగి చిన్నయ్యపడాల్ తదితరులు

చింతపల్లి:సమరోత్సాహంతో జాతీయ సమ్మెకు కదులుదామని. సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఈనెల 9న సార్వత్రిక సమ్మె సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచికను చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత కార్మికు ఉద్యమ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని రచించడానికి రంగం సిద్ధమైందని. కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాంగి ధనుంజయ్, సెక్యూరిటీ పరిరక్షకుడు సాగిన లక్ష్మణ పడాల్, బుజ్జిబాబు, జి మధు, లలిత కుమారి, ధారలక్ష్మి, ప్రసాద్, విశ్వనాథం, రామలక్ష్మి, ఈశ్వరరావు, రామారావు పాల్గొన్నారు,

వెలుగులో అవినీతి ఆరోపణలపై విచారణ

చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళల నిరసన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ

డ్వాక్రా మహిళలు చెల్లించిన రుణాల సొమ్మును ఖాతాలకు జమచేయకుండా వెలుగు సిసిలు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై మంగళవారం మండల కేంద్రంలో అధికారులు విచారణ చేపట్టారు. గసభ, సొవ్వా వీవోల పరిధి గిరిజన గ్రామాల్లో జరిగిన వెలుగు అవినీతిపై స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ పంచాయతీ అధికారి కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆయా విఒల పరిధిలోని గసభ, మొర్రిగుడ, లోగిలి, జంగిడివలస, అడ్రగుడ గ్రామాలతో పాటు సొవ్వ పంచాయితీ గ్రామాల డ్వాక్రా సంఘ మహిళలు అధికారులు ఫిర్యాదు చేశారు దీంతో అధికారులు విచారణ అధికారిగా డిఎల్‌పిఒ కుమార్‌తోపాటు ఎంపిడిఒ వెలుగు అధికారులను విచారణ కమిటీగా నియమించారు. డ్వాక్రా సంఘల మహిళలు తీసుకున్న రుణాల చెల్లింపుపై పూర్తి విచారణ చేపట్టారు. 2014-19లో ఎస్టీ సబ్ ప్లాన్, స్త్రీనిధి, విఒల ద్వారా రూ20వేల నుంచి రూ.50వేలు రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలను నెలవారి వాయిదాలుగా వెలుగు సిసిలకు చెల్లించారు. అయితే డ్వాక్రా మహిళలు చెల్లించిన రుణాల సొమ్మును మండల మహిళ సమాఖ్య ఖాతాకు సిసిలు జమ చేయలేదు. గతేడాది రుణాలు చెల్లించాలని డ్వాక్రా సంఘాల మహిళలకు నోటీసులను జారీ చేశారు. తీసుకున్న రుణాలను వాయిదాలుగా పూర్తి చెల్లించి రసీదులను పొందడం జరిగిందని వెలుగు ఎపిఒకు ఫిర్యాదు చేశారు. మండల స్థాయిలో విచారణ చేపట్టగా సుమారు రూ12 లక్షలు అవినీతి జరిగిందని నిర్ధారించారు. రుణవాయిదాలను చెల్లించిన డ్వాక్రా మహిళలు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. అక్రమాలపై పాల్పడిన సిసిలపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

మొక్కల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- ప్లాంటేషన్‌లో అల్లూరి జిల్లా టాప్

- జిల్లా కలెక్టర్ ఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : మొక్కలు పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అల్లూరి జిల్లాలో మాత్రమే అత్యధికంగా 33శాతం మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. మంగళవారం పాడేరు మండలం ఇరడాపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలసి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఒక లక్ష మొక్కలు నాటడం లక్ష్యం కాగా అందులో అల్లూరి జిల్లాలో మాత్రం 35 వేల మొక్కలు నాటాలన్నారు. ఉద్యాన శాఖ, ఉపాధి హామీ విభాగాల ద్వారా చేపట్టే మొక్కల పెంపకంతో ప్రతిఒక్కరికీ 1.07లక్షల ఆర్థిక లబ్ది చేకూరుతుందన్నారు. రైతులతో సంప్రదించిన మీదట సిల్వర్‌వోక్ మొక్కలు గాలివానలకు పడిపోతున్నాయని చెప్పిన నేపథ్యంలో 64 శాతం ఆ మొక్కలతో 36 శాతం నేరేడు, పనస, నిమ్మ మొక్కలు నాటడం ద్వారా వాతావరణం సమతుల్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పథక సంచాలకులు విద్యాసాగర్, డైరెక్టర్ నాగరాజు, గంగులు పాల్గొన్నారు.

పలుచోట్ల మొక్కలు నాటివేత

డుంబ్రిగుడ: మొక్కలను నాటి, వాటిని సంరక్షించుకోవాలని కండ్రం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కె.హరి, పోతంగి సర్పంచ్ వి వెంకట్రావు అన్నారు.. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన మొక్కలను మంగళవారం ఆయా పంచాయతీ గ్రామాల్లో వారు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలసాయ పంటల సాగు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంద్నారు. గిరిజనుల సాగు భూముల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆనంద్, ఉప సర్పంచ్ ఉన్న జగ్గునాయుడు, పంచాయతీ కార్యదర్శి గౌతమి, టిఎ సతీషకుమార్, ఫీల్డ్ అసిసెంట్లు శాంతకుమారి, దాలిమ్మ పాల్గొన్నారు.

జికె.వీధి : మండలంలో వనం మనం కార్యక్రమంలో భాగంగా సంకాడ, జర్రిలా దామనపల్లి,పెదవలస పంచాయతీలలో స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో అధికారులు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మొక్కలు నాటారు. పెదవలస టెంట్ల వీధి గ్రామంలో మొక్కలు నాటిన కార్యక్రమాన్ని ప్రారంభించిన వైస్ ఎంపిపి సప్తగడ్డ ఆనంద్ ప్రారంభించగా, ఎంపిఒ రాంప్రసాద్, మాజీ ప్రధాన కార్యదర్శి మామిడి నాగేంద్ర పెదవలస గ్రామ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు పేసా కమిటీ అధ్యక్షులు కంకిపాటి గిరిబాబు గ్రామ కమిటీ అధ్యక్షులు నూకరాజు కూటమి నాయకులు, ఉపాధి సిబ్బంది,విఆర్‌పిలు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి- జికె.వీధి : మండల ఆటో డ్రైవర్లంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానికసిఐ వరప్రసాద్,ఎస్ఐ అప్పల సూరి. సూచించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రయాణికులపై దురుసు ప్రవర్తన తగ్గించాలని, ప్రమాదల వలన డ్రైవర్లు నష్టపోతున్న తీరును వివరిస్తూ తగు జాగ్రత్తలు పాటించాలని, డ్రైవర్ల నేరచరిత్రపై ఆరా తీస్తున్నామన్నారు. ఆటోలు, ఇతర వాహనాల్లో గంజాయి వంటి పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా నడుచుకోవాలని సూచించారు.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-చింతపల్లి: రెండు వారాలుగా ఎడతెరిపిలేని వర్షాలకు భూమి ఎక్కడికక్కడే చెట్లు విద్యుత్‌స్తంభాలు కూలుతున్నాయి. జి. మాడుగుల ప్రధాన రహదారిలోని అన్నవరం-పనసలపాడు మధ్య బర్రింగిబంధ గ్రామం వద్ద భారీ మర్రిచెట్టు కూలిపోయింది. దీంతో సుమారు గంటసేపు జి. మాడుగుల నుంచి వచ్చే చింతపల్లి-జీకే వీధి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అన్నవరం ఎవేీరబాబు, ఎపిఎస్‌పి సిబ్బంది వెంటనే స్పందించి, ఘటనాస్థలికి చేరుకొని కూలిన చెట్టును పూర్తిగా తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. కూలిన చెట్టు తొలగింపులో పోలీసులకు స్థానికులు సహకరించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయితీ తోటవలస గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం నేలకొరిగాయి.ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం పడడంతో దాదాపు రెండు గంటల పైగా ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. సహాయక చర్యలు చేపట్టి స్తంభాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న పిఒ సింహాచలం

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజన రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందే విధంగా చర్యలు చేపడుతున్నామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో ఏడు మండలాలకు సంబంధించిన ప్రైమరీ సెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏజెన్సీలోని ఏడు మండలాల్లో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో 550 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కోతులను నివారించేందుకు 50 ఎకరాల బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ఏజెన్సీలో గిరిజన రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఎవరి పేర్లైనా జాబితాలో లేకపోతే రైతుసేవా కేంద్రంలో ఆధార్‌కార్డ్, పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకుని ఈ నెల 13వ తేదీలోపు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జీడిమామిడి తోటల అభివద్ధికి గిరిజన రైతులకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గిరిజన రైతుల భూముల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఏ పథకాలు అమలు చేయుచున్నదీ అదేవిధంగా ఉద్యానవన పంటలు ఈ విధంగా రైతులకు మేలు చేకూర్చుచున్నది శాఖల వారీగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, అసిస్టెంట్ డైరెక్టర్ గణేష్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్ కెవి చౌదరి, సావిత్రి, వ్యవసాయ శాఖాధికారులు, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు పాల్గొన్నారు.

సింహగిరి ప్రదక్షిణకు 200 బస్సులు

- జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింహాచలం గిరి ప్రదక్షిణకు ఎపిఎస్ ఆర్టిసి 200 బస్సులను నడుపుతున్నట్లు, వీటిలో విశాఖపట్నం జిల్లా నుండి సింహాచలం కొండ పైనుండి, కొండ దిగువకు 50 బస్సులు తిరుగుతాయని,, సింహాచలం నుండి ద్వారకా బస్‌స్టేషన్, గాజువాక, ఆర్‌కెబీచ్, కొత్తవలస మొదలగు ప్రాంతాలకు సుమారు 150 బస్సులు తిరుగుతాయని ఎపిఎస్‌ఆర్టిసి, విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు తెలిపారు. బస్సులు బుధవారం ఉదయం 5 గంటల నుండి గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు తిరుగుతాయ్నారు. వివిధ పాయింట్లలో బుధవారం నుండి గురువారం వరకు ఆర్టిసి అధికారులు, సూపర్‌వైజర్లకు డ్యూటీలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ గంగాధర్,టాటా కమాండ్స్ ఇంజనీర్ గోపి, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ నాయుడు మొదలగు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు ఆధ్వర్యంలో నగరంలోని రేషన్‌డిపోలు, అంగన్‌వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పితాని దిబ్బ, దండుబజార్, జెండా వీధి, రామజోగి పేట, రైల్వే న్యూ కాలనీ, తాటిచెట్లపాలెం, మురళీనగర్ ప్రాంతాల్లో రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పితానిదిబ్బ వద్ద గల రేషన్ డిపోలో స్టాక్‌బోర్డు లేని కారణంగా మెమో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జెండావీధి వద్ద రెండు రేషన్‌డిపోలకి సరుకు వ్యత్యాసం రావడంతో, డిపో నెంబర్ 130,131లపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. రైల్వేన్యూకాలనీ డిపో నెంబర్ 41 సరుకు రికార్డులు పరంగా వ్యత్యాసం మూలంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రైల్వేన్యూ కాలనీ వద్దగల అంగన్‌వాడి కేంద్రంలో 100 గుడ్లు వ్యత్యాసం కారణంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. మురళీనగర్ హైస్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం తీరును పరిశీలించి కోడిగుడ్డు రికార్డుల్లో వ్యత్యాసం మూలంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు నిర్వహిస్తామని, అవసరమైతే ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఫోర్ లైన్ డిపార్ట్మెంట్స్ సివిల్ సప్లై, ఎడ్యుకేషన్, ఐసిటిఎస్, లీగల్ మెథడాలజీ, ఫుడ్ సేఫ్టీ,విజిలెన్స్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి



పొల్లూరులో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ సీత

ప్రజాశక్తి విలేకరుల యంత్రాంగం: వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో వైఎస్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్‌డిఐ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, రాజిపేట సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మోతుగూడెం పంచాయతీ పరిధిలో పొల్లూరులో వైఎస్ జయంతి స్థానిక సర్పంచ్ ఆకేటి సీత ఆధ్వర్యంలో నిర్వహించారు. స్కూల్ పిల్లలకు పలకలు పుస్తకాలు పంపిణీ చేశారు.కొయ్యూరు మండలం బూదరాళ్లలో వైఎస్ జయంతి నిర్వహించారు. వైసిపి మండల నాయకులు సుమర్ల సూరిబాబు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గంగవరంలో వైఎస్ జయంతి ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల కమిటి అధ్యక్షులు ఎజ్జు వెంకటేశ్వరరావు, వైసిపి మండల ఇన్‌చార్జి రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు ,పండ్లు పాలు పంపిణీ చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జికె వీధి మండలం సీలేరులో వైఎస్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు వెంకట్రావు బుజ్జి అభిమానులు పాల్గొన్నారు. కూనవరం మండలంలో వైసిపి మండల అధ్యక్షులు ఆలూరు కోటయ్య ఆధ్వర్యంలో వైఎస్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల జెడ్‌పిటిసి గుజ్జ విజయబాబు, ఎంపిపి పాయం రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో మాజీ ఎంపిటిసి గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ) అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కొండ జాకోబ్ జెడ్‌పిటిసి సభ్యులు గొర్లె బాలాజీ, మండల అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలోని వైసిపి మండల అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్‌సిలో వైఎస్ జయంతి సందర్భంగా రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘననివాళి

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు అంబేద్కర్ సెంటర్ వద్ద వైఎస్ నిలువెత్తు విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాజ విశ్వేశ్వరరాజు పూలమాలలు వేసి పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురస పార్వతమ్మ, కూడా సురేష్ కుమార్, కిల్లో ఊర్వశి రాణి, ఎంపీటీసీ లకే రామకష్ణ పాత్రుడు, సర్పంచులు వనుగు బసవన్న దొరా, వంతాల రాంబాబు, గబ్బడి చిట్టిబాబు, గొల్లోరి నీలకంఠం, పాల్గొన్నారు. చింతపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపిపి సాగిన వెంగళరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్‌వల్లి, ఎంపిటిసి ధారలక్ష్మి, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కవడం ఈశ్వరరావు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి వైసిపి నేతలు నివాళులర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు.



పాడేరులో నివాళులర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే మత్స్యరాజ విశ్వేశ్వరరాజు

కల్వర్టు పనుల జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టౌన్‌కొత్తరోడ్డు ప్రధాన రహదారిలోని కల్వర్టుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనుల జాప్యంపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన పనులు మెల్లగా సాగుతూ ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆయన మంగళవారం పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ పై అసహనం వ్యక్తం చేశారు. రోజుల తరబడి పనులు చేస్తే ప్రజలు ఎలా ప్రయాణాలు చేస్తారని ప్రశ్నించారు.

నేడు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సమావేశ మందిరంలో జరగనుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

వరద సహాయక చర్యలు పకడ్బందీగా ఉండాలి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శిరిషాదేవి

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: వరదలు వస్తే పకడ్బందీగా సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శిరీషదేవి అధికారులకు సూచించారు. వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వరరామచంద్రాపురం మండలంలో సుపరిపాలన- ముందుడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేనపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ములకాల సాయికృష్ణ, బాగుల అంజన్‌రావు కూడా పర్యటించారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు అమరవరపు వసంతను పరామర్శించారు. రూ.15వేలు పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. ఒక రోగికి గుండె ఆపరేషన్‌కి ముఖ్య మంత్రి సహాయనిధి రిలీఫ్‌ఫండ్ మంజూరు చేయాలని కోరామన్నారు. వరద బాధితులకు సహాయం అందించేందుకు కృషి చేయాలని వినతిపత్రం సమర్పించామన్నారు. మహిళా అధ్యక్షురాలు బాగుల ప్రమీల, సోడే గంగాధర్, సహాయ కార్యదర్శులు కొత్తూరి శేషు, ముంజపు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్‌ఆర్ జాబితాలో చేర్చండి

రానున్న వరదలు నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు వరద ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని రంపచోడవరం నియోజక ఎమ్మెల్యే మిరియాల శిరీష అన్నారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన వరదసమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరదలు సంభవిస్తే చేపట్టే చర్యలపై దిశానిర్దేశం చేసారు. ముందుగా ఏయే గ్రామాలూ నీటమునుగుతున్నాయో అక్కడ బోట్లు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యసిబ్బంది సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. స్పందించిన రేఖపల్లి ప్రభుత్వ వైద్యులు అనిల్ మాట్లాడుతూ ఇప్పటికే అవసరమైన అన్ని రకాల మందులు సిద్ధం చేసామన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బందితో కూడా మాట్లాడారు. భీమవరంలో ప్రస్తుతం ఒక పిటిఆర్ మాత్రమే పనిచేస్తోందని మరొకటి పనిచేయడం లేదన్నారు. సియండితో మాట్లాడతామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి రథయాత్ర ఆదాయం రూ.90.42 లక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టౌన్‌కొత్తరోడ్డులో ప్రసిద్ధి చెందిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలు ముగిసాయి. మంగళవారం ప్రధాన ఉత్సవ అధికారి టి.అన్నపూర్ణ, ఆలయ ఇఒ టి.రాజగోపాల్‌రెడ్డి, విశాఖ జిల్లా తనిఖీదారు ఎం.శ్రీధర్, ఉత్సవ్‌కమిటి సభ్యులు, పోలీసుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు చేయగా, పది రోజులకు గాను హుండీ ఆదాయం రూ.19,42,570 వచ్చింది. ఈ సంవత్సరం రథయాత్ర మహోత్సవాల్లో మొత్తం రూ.90,42,113 ఆదాయం వచ్చిందని అధికారులు ప్రకటించారు. క్రిందటి సంవత్సరం కంటే రూ.4,90,445 అధికంగా వచ్చిందన్నారు. ఈనెల 14 న దేవస్థానం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఇఒ రాజగోపాల్ రెడ్డి మీడియాకు తెలిపారు.

మెగా పేరెంట్స్ టీచర్స్‌డేపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెగా పేరెంట్స్ టీచర్స్‌డేపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష మండల విద్యాశాఖ అధికారులతో మంగళవారం కలెక్టరేట్ సమావేశం నిర్వహించారు. మెగా పిటిఎం ఏర్పాట్లు గురించి, అతిథుల ఆహ్వానం, సాక్షి నమోదు, మొక్కలు పాఠశాలలకు చేరాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్‌ఆర్‌వికెఎం కిట్స్ అందరికీ అందేటట్లు, యూనిఫామ్స్ అందరూ వేసుకునేటట్లు, తల్లికివందనం రానివారు అప్లై చేయడానికి వీలుగా ఏర్పాటు చేసుకుని, వెరిఫై చేయించి,రిలీజ్ చేసేటట్లు తగు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులందరికీ ఆరోగ్యపరీక్షలు పూర్తయ్యేటట్లు చూడాలని ఎంఇఒలకు సూచనలు జారీ చేశారు.